క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

వంగర: మండలంలోని రుషింగి గ్రామంలో ఉన్న శ్రీదుర్గా షిర్డీసాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు యలకల మురళీకృష్ణ, యలకల శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో కుంకుమపూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోపూజ చేస్తున్న భక్తులు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని మల్లిఖార్జునకాలనీలో ఉన్న గాయత్రి ధ్యాన మందిరంలో శనివారం గోపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ 12వ వార్షికోత్సవం పురస్కరించుకుని, మహాగణపతి హోమం, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం తదితర పూజలు చేశారు. ఆలయ అర్చకులు జాడ రామవెంకటసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో లలితా సహస్ర నామస్తోత్రం, సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు.

బీజామృతం తయారీపై అవగాహన



బీజామృతం తయారీని పరిశీలిస్తున్న రైతులు

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో బీజామృతం తయారీపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎల్టు గౌరీశ్వరరావు, ఐసీఆర్పీలు పైల తవిటినాయుడు, రమణ, గోవిందమ్మలు తొలుత తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం, ఆరోగ్యవంతమైన పంటల సాధనకు పాటించాల్సిన ప్రకృతి వ్యవసాయ విధానాలను వివరించారు. అనంతరం బీజామృతం తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, దాని ప్రయోజనాలు తెలిపారు. పంటలకు సోకిన తెగుళ్లను బీజామృతంతో నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మహిళలకు ఆరోగ్య సలహాలిస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: మహిళలు, బాలికలంతా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు సూచించారు. మండలంలోని లచ్చారాయపురం గ్రామంలో శనివారం నిర్వహించిన ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రక్తహీనత బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా ప్రతిరోజూ పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని, అలా చేస్తేనే రక్తహీనత బారిన పడకుండా ఉండగలమన్నారు. సమావేశంలో ఏపీఎం టి.మంగమ్మ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



పిల్లలకు వడ్డించిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఉపాధ్యాయులకు ఎంఈవో ప్రసాదరావు సూచించారు. మండలంలోని ఆమదాలవలస కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు, ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, టీఎల్‌ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్), లెస్సన్ ప్లాన్ వినియోగించి, పాఠ్యాంశాలు బోధించాలని తెలిపారు. సక్రమంగా జగనన్న గోరుముద్ద పథకం అమలుచేసి, ప్రతిరోజూ విద్యార్థులకు మధ్యాహ్నం మంచి భోజనం అందివ్వాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు పాలవలస సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు రమాదేవి, వెంకటరమణ ఉన్నారు.

మారిన కళాశాల రూపురేఖలు

- మద్దువలస జూనియర్ కళాశాలకు కొత్తరూపు
- నాడు–నేడు పనులతో యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి
- అదనపు తరగతి గదులు, ల్యాబ్, టాయిలెట్లు, ఫర్నిచర్ ఏర్పాటు
- మౌలిక సదుపాయాల కల్పనతో విద్యార్థుల్లో ఆనందం



తరగతి గదిలో ఏర్పాటు చేసిన డ్యూయల్ డెస్క్ బెంచీలు

ఇది కదా.. అభివృద్ధి

వంగర: మండల పరిధిలోని మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల రూపురేఖలు మారాయి. 260 మంది విద్యార్థులుండే ఈ కళాశాలకు ఒకప్పుడు ఒక తాగునీటి బోరు కావాలంటే సంవత్సరాల తరబడి అధికారులు, రాజకీయ నాయకుల కాళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి. అప్పట్లో తాగునీటి సదుపాయం లేకపోవడంతో అరకిలోమీటరు దూరంలోని గ్రామంలోకి విద్యార్థులు వచ్చి, భోజనం చేసి వెళ్లేవారు. అరకొర సదుపాయాలతో తరగతి గదులు కూడా ఉండగా, ఆ సమస్యలన్నింటికీ నాడు–నేడు పథకం పనులతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెక్ పెట్టారు. రూ.85 లక్షల వ్యయంతో కళాశాలలో అభివృద్ధి పనులు చేపట్టారు.

చేపట్టిన పనులు ఇవి..

తరగతి గదుల ఆధునీకరణ, బాల,బాలికలకు వేర్వేరుగా కొత్త మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, డిజిటల్ తరగతుల బోధనకు ఐఎఫ్‌పీలు, మెయిన్‌గేటు, అన్ని గదులకు కిటికీలు, తలుపులు ఏర్పాటు, అన్ని గదుల్లో డ్యూయల్ డెస్క్ బెంచీలు, గ్రీన్ చాక్‌బోర్డుల ఏర్పాటు, ల్యాబ్ గదుల ఆధునీకరణ, ప్రహరీగోడ నిర్మాణం వంటివి చేపడుతున్నారు. వీటిలో కొన్ని పనులు ఇప్పటికే పూర్తి కాగా కళాశాల సరికొత్త రూపును సంతరించుకుంది. మరి కొన్ని పనులు చకచకా జరుగుతున్నాయి. ఇప్పుడు మా కళాశాల బాగుందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల



డిజిటల్ తరగతుల బోధన కోసం ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ



కొత్తగా ఏర్పాటు చేస్తున్న మరుగుదొడ్లు

సమస్య తీరింది..



ఎన్నో ఏళ్లుగా కళాశాలలోని మరుగుదొడ్ల సమస్య ఇప్పుడు తీరింది. ఒకప్పుడు టాయిలెట్‌కు వెళ్లాలంటే ఇబ్బంది పడేవాళ్లం. టాయిలెట్ కోసం ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకం పనులతో మా కళాశాలలో కొత్తగా మరుగుదొడ్లు, టాయిలెట్లు నిర్మించారు. జగన్ మామయ్యకు ధన్యవాదాలు.

నమ్మి ఆరుద్ర, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం, మద్దువలస.

సరికొత్తగా తరగతి గదులు..



కళాశాలలో తరగతి గదులను సరికొత్తగా చేశారు. గ్రీన్‌బోర్డుల ఏర్పాటు, ల్యాబ్‌ల ఆధునీకరణ, కొత్త ఫర్నిచర్‌తో కళాశాల కళకళలాడుతోంది. సుదీర్ఘకాలంగా కళాశాలలోని సమస్యలకు సీఎం జగన్ పరిష్కార మార్గం చూపడం ఆనందంగా ఉంది.

జె.రమ, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం, మద్దువలస.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం..



కళాశాలలో దశాబ్దాల తరబడి సమస్యలు తిష్టవేశాయి. ప్రభుత్వం నాడు–నేడు పనుల్లో భాగంగా కళాశాల అభివృద్ధి పనులు జరిగాయి. ఇప్పుడున్న కళాశాలను చూస్తుంటే కొత్త కళాశాలను చూస్తున్నట్లుంది. ప్రస్తుతం అన్ని సమస్యలు తొలగి, బాగుంది.

-కొరటాన నారాయణరావు, ప్రిన్సిపాల్, మద్దువలస.

దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: మహిళలు, బాలికల రక్షణే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం తీసుకువచ్చిన దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దిశ యాప్ ఇన్‌స్టాల్(డౌన్‌లోడ్), వినియోగం, ప్రయోజనాలపై విద్యార్థినులకు శనివారం అవగాహన కల్పించారు. ఎప్పుడు ఏ ఆపద వచ్చినా ఫోన్‌లోని దిశ యాప్ ద్వారా పోలీసులను ఆశ్రయించి, క్షణాల వ్యవధిలో రక్షణ పొందవచ్చన్నారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై కూడా ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని, బ్యాడ్ టచ్‌కు గురైనప్పుడు వెంటనే తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. ఇంట్లోని తల్లిదండ్రులు బయటకు వెళ్లే సమయంలో ఇరుగుపొరుగు వ్యక్తులు మన పట్ల చెడుగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు చెప్పాలని, లేకపోతే యాప్ ద్వారా పోలీసులను ఆశ్రయించాలన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని గిరిజా రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని రూ.25 లక్షలతో అభివృద్ధి చేయగా, మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో స్వామి వారిని ఎమ్మెల్యే దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లోని ఆలయాల ద్వారా ఆధ్యాత్మికత విల్లివిరిసి, గ్రామాలు ప్రశాంతంగా ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. మధ్యాహ్నం 10 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, పీఏసీఎస్ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్, జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: స్థానిక కోర్టులో మార్చి 9వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. ఇదే విషయమై ఆయన కోర్టులో పోలీస్, రెవెన్యూ, బ్యాంక్ అధికారులతో శనివారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ అదాలత్ తీర్పే అంతిమమని, వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ మహేందర్, సీఐ డి.మోహనరావు, తహసీల్దార్ ఎస్.కె.రాజు, రేగిడి ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ అవగాహన సదస్సు

స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు మాట్లాడుతూ ప్రస్తుతం స్త్రీలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని, పని ప్రదేశాల్లో అందరూ సోదరభావంతో మెలగాలని తెలిపారు. స్త్రీలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, వారిపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి.ఎస్.వి.బి. కృష్ణసాయితేజ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

బొబ్బిలి: స్థానిక మండల పరిషత్ ఆవరణలో ఈ నెల 26వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎం శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు వివిధ ఉపాధి కోర్సులలో శిక్షణ, ఉద్యోగాలకు సంబంధించి ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఎంపికైన పురుష అభ్యర్థులకు 3 నుంచి 4 నెలల పాటు ఉచిత వసతితో పాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 18 నుంచి 27 ఏళ్ల వయసు ఉండి, పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో చదివిన వారు అర్హులన్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే మండలాభివృద్ధి



సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపై జరిగిన సమీక్షలో వివరాలు వెల్లడిస్తున్న అధికారి

రేగిడి: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యమని, ఇరువురూ పరస్పరం సహకరించుకుని అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఎంపీపీ దార అప్పలనరసమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోందని, మనమంతా సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వ లక్ష్యం చేరుకోవాలన్నారు. తొలుత తాగునీటిపై సమీక్ష నిర్వహించగా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీచరణ్ మాట్లాడుతూ మండలంలో 17 గ్రామాలకు జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. కొత్తగా ఉనుకూరు, మునకలవలస, బాలకవివలస, వన్నలి, ఉప్పర్నాయుడువలస, గడబపేట గ్రామాలకు ఇంటింటికీ కుళాయిలు వేయనున్నామన్నారు. మండలంలో 39 పంచాయతీల్లో 380 తాగునీటి బోర్లు పనిచేస్తున్నాయని, మరమ్మతులకు గురైన బోర్లు బాగు చేసేందుకు రూ.5 లక్షల నిధులు కేటాయించామన్నారు. వ్యవసాయ శాఖ చర్చలో ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్ వరి పంటకు సంబంధించి, 19 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసి, సకాలంలో బిల్లుల చెల్లింపులు చేశామన్నారు. మరో 200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పుడు కొనుగోలు చేస్తున్నామన్నారు. తహసీల్దార్ రాములమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో భూముల రీ సర్వే చాలా చురుగ్గా జరుగుతోందన్నారు. కందిశ ఎంపీటీసీ కెల్ల చిట్టెమ్మడు మాట్లాడుతూ కందిశ గ్రామంలో భూములు రీ సర్వే చేశారని, ఈ ప్రాప్తికి ఈ పాసుపుస్తకాల్లో భూముల వివరాలు సక్రమంగా లేవని, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందా అని ప్రశ్నించారు. స్పందించిన తహసీల్దార్ ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. తోటపల్లి ఏఈ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తోటపల్లి కాలువల ద్వారా పంట పొలాలకు ఖరీఫ్‌లో సాగునీటిని ఇచ్చామని, వచ్చే ఖరీఫ్‌కు కూడా ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు మాట్లాడుతూ కొండవలస నుంచి కోడిశ, కందిశ గ్రామాలకు కాలువల ద్వారా సాగునీరు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, కాలువల్లో రాతిబండలు తీయకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయని, వాటిని తొలగించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో జె.శ్యామలాకుమారి పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

వంగర: మండల పరిధిలోని మద్దువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశాలకు సంబంధించి, దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ప్రస్తుతం విధించిన గడువు ఈ నెల 23వ తేదీతో ముగియగా, ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దత్త జ్ఞానబోధ సభ

రేగిడి: స్థానిక గురుదత్త పీఠంలో దత్త జ్ఞానబోధ సభ శనివారం నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత పాదుకాపూజ, గణపతి హోమం, ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం, ఆధ్యాత్మికవేత్తలకు సన్మానాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరు జిల్లా ముండూరు యజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతులు, భారతీయ ధర్మ పరిషత్ జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణచరణానంద భారతీస్వాములు మాట్లాడుతూ భీష్ముడు, ఛత్రపతి శివాజీలు దేశం కోసం, ధర్మం కోసం జీవితాంతం పోరాడి, గోవధను నివారించారన్నారు. త్రేతాయుగంలో తండ్రికి ఇచ్చిన మాట కోసం రాముడు రాజ్యాన్ని త్యజిస్తే, ద్వాపరయుగంలో భీష్ముడు రాజ్యంతో పాటు జీవితాన్ని త్యాగం చేసి తండ్రి కోసం ఆజన్మ బ్రహ్మచారిగా ఉన్న మహనీయుడని కొనియాడారు. ఈ కలియుగంలో ప్రజలంతా అటువంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని, జీవించాలని కోరారు. కార్యక్రమంలో దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు, జద్దు జగ్గారావు, ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ పాల్గొన్నారు.

నేడు రారవే సమావేశం

రాజాం సిటీ: పట్టణంలోని మాధవబజార్ దగ్గరున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 25వ తేదీన రారవే(రాజాం రచయితల వేదిక) 109వ సమావేశం ఆదివారం నిర్వహించనున్నామని నిర్వాహకులు గార రంగనాథం ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ సమావేశంలో 'సమాజానికి అవసరమైన సాహిత్యం' అనే అంశంపై బమ్మిడి సుబ్బారావు ప్రసంగిస్తారని, అలాగే ఆయన రచించిన 'జనజాగృతి గీతావళి' పాటలను బాలక కామేశ్వరరావు ఆలపించనున్నారన్నారు. కార్యక్రమానికి కవులు, రచయితలు, బాషాభిమానులు, సాహిత్యాభిమానులు హాజరుకావాలని కోరారు.

చైతన్య సభ

బొబ్బిలి: స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో శనివారం నిర్వహించిన చైతన్య సభకు మంద కృష్ణ మాదిగ హాజరై, కాసేపు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు న్యాయస్థానం ఓ ప్రత్యేక కమిటీని నియమించిన నేపథ్యంలో ఈ సభ ఏర్పాటు చేయగా, హక్కుల సాధనపై మాదిగ కుల ప్రజలకు దిశానిర్దేశం చేశారు. సభలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వలల పంపిణీ



వలలు అందజేస్తున్న సర్పంచ్ రాము

తెర్లాం: మండలంలోని వి.చిన్నయ్యపేటలోని గొర్రెలు, మేకల పెంపకందారులకు సర్పంచ్ చప్ప రాము చేతులమీదుగా శనివారం వలలు పంపిణీ చేశారు. 150 అడుగుల పొడవైన వలలు, 300 మీటర్ల తాడు, రెయిన్‌కోట్‌లను ప్రభుత్వం సబ్సిడీపై అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ పశుసంవర్ధక శాఖ సహాయకులు సీహెచ్ రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరి అమానుషం



కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీఐటీయూ నేతలు

రాజాం సిటీ: రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరి అమానుషమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని రైతులతో కలిసి ప్రధాని మోదీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. రెండేళ్ల క్రితం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ పోరాటం చేస్తున్న అన్నదాతలపై కాల్పులు జరపడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఇదే కాల్పుల్లో ఓ యువరైతు మరణించడం చాలా బాధాకరమన్నారు. దీనికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, హర్యానా ముఖ్యమంత్రి ఎం.ఎల్.కట్టర్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కాల్పుల్లో గాయపడిన రైతులను ఆదుకోవడంతో పాటు మృతి చెందిన రైతు కుటుంబానికి నష్టపరిహారం అందివ్వాలన్నారు. పంటలకు సంబంధించి, మద్దతు ధర చట్టం చేసేంత వరకు పోరాడతామన్నారు. కార్యక్రమంలో కంచినాయుడు, భుజంగరావు, అప్పలనాయుడు, తవిటినాయుడు, రాము, తిరుపతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

- నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తలంతా తరలిరావాలని ఎమ్మెల్సీ విక్రాంత్ పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: పట్టణంలోని ఎస్.ఆర్.కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తెలిపారు. ఇదే విషయమై ఎస్.ఆర్.కన్వెన్షన్ హాల్‌లో శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో పార్టీ కార్యకర్తలను సమయాత్తం చేసేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామని, కార్యకర్తలంతా తరలిరావాలని కోరారు. ఇదే సమావేశానికి పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్, పార్లమెంట్ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు హాజరుకానున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారన్నారు. నియోజకవర్గంలోని పార్టీ ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలంతా హాజరుకావాలన్నారు.

ధనబలమున్న వారికే టీడీపీ సీట్లు..

టీడీపీ–జనసేన అభ్యర్థుల జాబితా విడుదలపై స్పందించిన ఆయన ధనబలమున్న వారికే టీడీపీ సీటన్నీ ప్రకటించిందని విమర్శించారు. టీడీపీని నమ్ముకున్న సీనియర్ నాయకులను సైతం ఆ పార్టీ పక్కన పెట్టి మోసం చేసిందన్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బులను ఎవరైతే ఎన్నికల్లో బాగా ఖర్చు పెట్టగలరో వారికే చంద్రబాబు సీట్లు పంచి పెట్టారన్నారు. తొలివిడత సీట్ల ప్రకటనలో బీసీలు, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అన్యాయం జరిగినట్లు తెలుస్తోందన్నారు. ఈ సీట్ల ప్రకటనతో రాష్ట్రంలో టీడీపీ ఘోర పరాజయం పాలవుతుందని, వైఎస్సార్ సీపీ గెలుపు మరోసారి ఖాయమన్న విషయం స్పష్టమవుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, రాజాం, రేగిడి వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, యాలాల వెంకటేష్‌లు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత కొలతల్లో పనులు చేయాలి



కోడూరులో వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు



కంచరాంలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో సాయిరాం

బాడంగి: నిర్దేశిత కొలతల ప్రకారం ఉపాధి హామీ పథకం పనులు చేయాలని ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. మండలంలోని కోడూరు, ముగడ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించి, వేతనదారులతో రెండు పూటలా పనులు చేయించాలని తెలిపారు. పనిలోకి వచ్చిన వారికే మాత్రమే మస్తర్లు వేయాలన్నారు. కొలతల మేర పనిచేస్తేనే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందని వేతనదారులకు తెలిపారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్సా కిట్, టెంట్లు ఉండేలా చూసుకోవాలన్నారు.

రాజాం: ఉపాధి హామీ పథకం వేతనదారులంతా రెండు పూటలా పనిచేస్తేనే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఏపీవో కె.సాయిరాం అన్నారు. మండలంలోని కంచరాం, ఆగూరు, రాజయ్యపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన కొలతల ప్రకారం పనులు చేయాలని, వేసవిని దృష్టిలో ఉంచుకుని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఏ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9010133309
Office mail : vzmadvt@gmail.com